"మాతా పితా యువతయః తనయా విభూతిః

సర్వమ్ యదేవ నియమేన మదన్వయానామ్।

ఆద్యస్య నః కులపతిః వకుళాభిరామమ్

శ్రీమత్ తదంఘ్రి యుగళమ్ ప్రణమామి మూర్ధ్నా ||

భక్తామృతమ్ విశ్వజనానుమోదనమ్

సర్వార్థదమ్ శ్రీ శఠగోప వాఙ్మయమ్

సహస్ర శాఖోపనిషత్ సమాగమమ్

నమామ్యహమ్ ద్రావిడ వేద సాగరమ్

కాశ్యపాన్వయ సంజాతమ్ శరణ్యార్య పదాశ్రితమ్

వైరాగ్య జలధిమ్ వందే రంగరామానుజమ్ మునిమ్

కౌండిన్యాన్వయ భాష్యకార తనయమ్ శ్రీ అప్పలార్యాశ్రితమ్

నాథ ద్వంద్వ పదార్చితమ్ చ సతతమ్ సంసేవ్య లక్ష్మీ సఖమ్

ఆంగ్ల, ద్రావిడ, సంస్కృతాంధ్ర బహు భాషా కోవిదమ్ ధీనిధిమ్

వేదాంతద్వయ తత్త్వ శాస్త్ర విదుషమ్ శ్రీ శ్రీనివాసమ్ భజే

---

# తిరువాయ్ మొళ్ళి సంక్షిప్తార్థము

విశిష్టాద్వైత సంప్రదాయమునకు నాలాయిర దివ్య ప్రబంధములను పునాదిగా పెద్దలు చెప్పుదురు. నాలాయిర దివ్యప్రబంధములనగా పండ్రెండు మంది ఆళ్వార్లు తమిళ భాష యందు పాడిన 4000 పాశురములు అనగా తమిళ పాటలు లేదా పద్యాలు.(ఇందు ఇరామానుశ నూత్తందాది యను 108 పాశురముల ప్రబంధము మాత్రము ఆళ్వార్లచే కాక తిరువరంగత్తముదనార్ల చే ప్రసాదింపబడినది). ఆళ్వార్ల యందు నమ్మాళ్వారు తలమానికమైన వారు. ఇదేవిధంగా  ఈ నాలాయిరమునందు వారు పాడిన "తిరువాయ్ మొழி " యను దివ్య ప్రబంధము అత్యంత ముఖ్యమైనది. దీనిని సామవేద సారమని చెప్పెదరు. దీనికి నంబిళ్ళగారు చెప్పిన "ఈడు" అను వ్యాఖ్యాన గ్రంథమునే "భగవద్విషయము" అని అందురు. దీనిని నంబిళ్ళ గారు ప్రవచించుచుండగా వడక్కు తిరువీధి పిళ్ళై అనువారు గ్రంథస్థము చేసిరట.

విశిష్టాద్వైత సంప్రదాయమున భగవద్రామునుజులనుగ్రహించిన "శ్రీభాష్యము" వలె "భగవద్విషయము" కూడ అనర్ఘరత్నము. భగవద్విషయమనగా ఇందు పరమాత్మ సంబంధమైన విషయము తప్ప వేఱొకటి కానరాదు. స్వామి నమ్మాళ్వార్లకు పరమపద ప్రాప్తి వరకు ఆ పరమాత్మతో ఆయనకు కలిగిన అనుభవ వర్ణనమే ఈ "తిరువాయ్ మొழி " ప్రబంధము. ఇట్టి ప్రబంధమునకు సమతుల్యమైన గ్రంథము మరొకటి లేదు. ఎంతయో పూర్వజన్మ సుకృతము, ఆచార్య కటాక్షము, పరమాత్మానుగ్రహము కలిగిన తప్ప ఈ తిరువాయ్ మొழி గ్రంథముననుభవించుట సంభవము కాదని పెద్దలు చెప్పుదురు.

ఈ ప్రబంధము నందు 1102 పాశురములు కలవు. ఇందలి ఒక్కొక్క శతకమును తమిళమునందు "పత్తు" అని అందురు. ఒక్కొక్క శతకము పది, పది పాశురములుగా (దశకములుగా) విభజించబడి యుంటుంది. ఈ దశకములనే "తిరువాయ్ మొழி " అని వ్యవహరిస్తారు. అనగా ఒక్కొక్క తిరువాయ్ మొழி లో 10 పాశురములు, ఒక ఫలశృతి పాశురము మొత్తము 11 పాశురములుండును. కాని పరమాత్మ ద్వాదశ నామాలతో నున్న ఒక దశకమున  మాత్రము  12 పాశురములు, ఒక ఫలశృతి పాశురము ఉండుటచే ఆ దశకమున 13 పాశురములు కలవు. అందువలన మొత్తము 11*10*10+ 2=1102 పాశురముల మహత్ప్రబంధము ఈ "తిరువాయ్ మొழி ". తిరువాయ్ మొழி  అనగా "శ్రీవాగ్వైభవము" అని అర్థము. ఈ ప్రబంధమంతయు "అందాది" అనబడు ముక్త పదగ్రస్తము అను అలంకారముతో నడుస్తుంది. అనగా ముందు పాశురము చివరి పదము తరువాతి పాశురమునకు మొదటి పదమై ఉంటుంది. ఈ విధముగా పురుషార్థ ప్రతిపాదనాది విషయములనే కాక ఈ ప్రబంధపు శబ్ద వైచిత్ర్యాది విశేషములు అనేకములు, అనుభవైక వేద్యములు, అనుసంధేయములు, అమిత ఫలప్రదములును.

ఈప్రబంధమునకు తెలుగు భాష యందు అర్థ తాత్పర్యములను మన పెద్దలు కృప చేసి యున్నారు. అంతే కాక తద్వ్యాఖ్యాన గ్రంథమైన "భగవద్విషయము" నకు దాసుని మాతృసమానులు శ్రీమతి కరి తిరువేంగళమ్మ గారు అనువాదమును కూడ ననుగ్రహించి యున్నారు. జిజ్ఞాసువులు ఆయా గ్రంథములను ఆచార్యముఖముగా అభ్యసించుట అభిలషణీయము, అఖిల ఫలప్రదము.

ఈ ప్రబంధమున విశిష్టాద్వైత సంప్రదాయ విషయములన్నియు పొందుపరచబడి యున్నవని పెద్దలు చెప్పుదురు.

ఉదాహరణకు అర్థ పంచక జ్ఞానము (అనగా జీవాత్మ నిజ స్వరూపము, పరమాత్మ స్వరూపము, జీవాత్మ పరమాత్మను పొందుట వలన ఫలము, పరమాత్మను పొందుటకు నుపాయము, తద్విరోధి అను వాటిని అర్థ పంచకము అని అందురు), తత్త్వ త్రయ జ్ఞానము(మన సంప్రదాయమున తత్త్వములు మూడు. అవి జీవాత్మ(లు), ప్రకృతి, పరమాత్మ. వీటినే తత్త్వ త్రయము అని అందురు), ద్వయ మంత్రార్థము(శ్రీమన్నారాయణ చరణౌ శరణమ్ ప్రపద్యే శ్రీమతే నారాయణాయ నమః అనునది ద్వయ మంత్రము. దీనికే మంత్ర రత్నమని పేరు. తదర్థ వివరణము ఈ ప్రబంధము అని పెద్దలు చెప్పెదరు), పరభక్తి, పరజ్ఞాన, పరమభక్తి అను వాటి అనుభవ స్థితులు, ముక్త జీవుడు పరమపదమునకు ప్రయాణించు అర్చిరాది మార్గము... ఇట్లు సకల సంప్రదాయ విషయములను తెలియ జెప్పు ప్రబంధమని "తిరువాయ్ మొఴి " ప్రసిద్ధి పొందినది.

స్వామి నమ్మాళ్వార్ దక్షిణ దేశమున "కురుగూర్" లేదా "కురుకాపురము" అను గ్రామమున "కారి" అను వారికి జన్మించిరి. ఒక శిశువు జన్మించినపుడు, దాని శిరోమధ్య భాగమునుండి "శఠవాయువు" ప్రవేశించి జన్మాంతర జ్ఞానము కోల్పోవుదురని పెద్దలు చెప్పెదరు. కాని ఆ "శఠవాయువు" తనను సోకకుండా కోపముతో దానిని వీరు అప్పుడే పారద్రోలిరట. శఠవాయువుపై కోపించుట చేత వీరిని "శఠగోపులు" అనియు, "శఠారి" అనియు చెప్పెదరు. వీరు విష్ణు పాద స్థానీయులగుటచేత, విష్ణ్వాలయములలో విష్ణుపాదములు గల "శఠారి"ని భక్తులు శిరస్సున ధరించుట మనకందరకూ అనుభవమే కదా!

వీరి కురుకాపురి సంబంధము చేతనే ప్రతి దశకమునకు చివరి ఫలశ్రుతి పాశురములలో కురుకాపురికి చెందిన శఠగోపుల చేత పాడబడిన ఈ పది పాశురములు అని చెప్పబడు చుండుట చూచెదము. వీరికే పర మతములకు అంకుశము వంటి వారగుటచే పరాంకుశులని, వకుళ పుష్ప మాలిక ధరించుటచేత వకుళాభరణులని ఇత్యాది నామములు గలవు.

వీరు పుట్టినది మొదలు ఒక చింత తొఱ్ఱలో పలుకులేక ధ్యానమగ్నులై కూర్చుండిరట. అట్టి మౌన ముద్రలో నున్న నమ్మాళ్వార్ చెంతకు కొన్ని సంవత్సరముల పిదప మధురకవులను మఱియొక ఆళ్వార్ వచ్చి పెద్ద శబ్దము చేయగా నమ్మాళ్వార్ కనులు తెరచిరట. అంత, మధురకవులు "శెత్తత్తిన్ వయర్ట్రిల్ శిరియదు పిరందాల్ ఎత్తై తిణ్ణు ఎంగే కిడక్కుమ్" అని ప్రశ్నించగా దానికి నమ్మాళ్వార్ "అత్తై తిణ్ణు అంగే కిడక్కుమ్" అని సమాధానమిచ్చిరట. దీనికి గూఢార్థము "చైతన్యము లేని దేహమున నుండు జీవము దేనిననుభవించి ఎచ్చటనుండును" అన్న ప్రశ్నకు "ఆ దేహమునకు చెందిన సుఖ దుఃఖముల ననుభవించుచు ఆ దేహమునందే యుండును".

అపుడు మధురకవులు ఆ శఠగోపుల మహత్త్వమును తెలిసికొని వారికి శిష్యులైరి.

అంతట శఠగోపులను లోకపరిచయము చేయుటకై శ్రీమన్నారాయణుడు ఆయనకు సాక్షాత్కారము కాగా, ఆళ్వార్లు అమితానందముతో పాడిన ప్రబంధములలో ముఖ్యమైనది "తిరువాయ్ మొఴ్ఴి " ప్రబంధము. (వారు తిరువిరుత్తమ్, తిరువాశిరియమ్, పెరియ తిరువందాది, తిరువాయ్ మొఴ్ఴి  అను నాల్గు ప్రబంధములు కృపచేసిరి. )

ఈ తిరువాయ్ మొఴ్ఴి  ప్రబంధమును పిదప వారి శిష్యులైన మధురకవులు గ్రహించిరి.

కాని, కాలగర్భమున ఈ ప్రబంధము మరుగున పడగా, నాథమునులు అను ఆచార్యులు తన అకుంఠిత దీక్షతో శఠగోపుల దర్శనము పొంది, వారినుండి ఈ ప్రబంధమును మరల గ్రహించి భక్తలోకమునకందిచ్చిరి.

ఈ ప్రబంధమునందలి ఒక్కొక్క దశకపు సారాంశమును కవితార్కిక సింహములైన శ్రీమాన్ వేదాంత దేశికులు సంస్కృతమున "ద్రమిడోపనిషత్" అను నామముతో అనుగ్రహించగా, విశద వాక్శిఖామణి శ్రీమాన్ మణవాళ మహామునులు తమిళ భాష యందు "తిరువాయ్ మొఴ్ఴి  నూత్తందాది " అను నామముతో దశక సారాంశములను పాశుర రూపముగా  ప్రసాదించి యున్నారు.

దాసుడు ఈ తిరువాయ్ మొఴ్ఴి  ప్రబంధమునందలి ఒక్కొక్క దశకమునకు సంక్షిప్తార్థమును మాత్రము సమర్పించే ప్రయత్నము చేస్తున్నాడు. దుస్సాహసమైన ఈ ప్రయత్నము కేవలము ఆచార్య కైంకర్యము మాత్రమే. సంక్షిప్త రూపము కనుక "పక్షి వీక్షణము" (bird's eye view) వలె కొలది పాటి ప్రబంధ పరిచయమునకు మాత్రమే అని ఈ ప్రయత్నపు ఉద్దేశ్యము. ప్రతి దశకమందలి విషయము సంక్షిప్తముగా గద్య, పద్య రూపములందిచ్చుటకు ప్రయత్నము.

పెద్దలందరికీ ఈ దోషములను మన్నించి మంగళాశాసనములు కృప చేయమని దాసుడు సాష్టాంగ ప్రణామములు సమర్పించి విన్నపించుకొను చున్నాడు. పెద్దలందరు దాసుని ఈ ప్రయత్నమునాశీర్వదించ ప్రార్థన.

**అడియేన్**

ఎస్.కె.వి. రామాచార్యులు రామానుజదాస (బెంగుళూరు)